

వైఎస్ఆర్

డ్వామా పీడీగా ఆదిశేషారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



డ్వామా పీడీగా ఆదిశేషారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న యధుభూషణ్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం ఒత్తిడిని తీవ్రం చేయడంతో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆగ్రోస్ జిల్లా అధికారి విజయ కుమార్ తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం రాష్ట్రంలో వెయిం టింగ్‌లో ఉన్న సుమారు 21 మంది డిఎల్‌డిఒల బదిలీలను ఇటీవల చేపట్టింది. తిరుపతి నుంచి బి.ఆది శేషారెడ్డిని డ్వామా పీడీగా బదిలీ చేసింది

పరిహారం మొరను ఆలకించండి?



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న 'సోమశిల' బాధితులు

- సోమశిల వెనుకజలాల బాధితుల వేడుకోలు
- వాలంటీర్ల ఉనికి గల్లంతుపై ఆందోళన
- భూకబ్జాదారుల బారి నుంచి రక్షించాలి
- హౌసింగ్ మంజూరులో అలసత్వం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులవెల్లువ కొనసాగుతోంది. ఒకే సమస్యపై పలుమార్లు పరిష్కార వేదికను ఆశ్రయించినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కొన్ని సమస్యల పరిష్కారానికి లైవ్‌లోనే తహశీల్దార్లను సంప్రదించి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నప్పటికీ తగ్గని పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకరు తమ భూమిని కబ్జా చేశారని, మరొ కరు వాలంటీర్ల ఉనికిని పరిరక్షించాలని, ఇంకొకరు సోమశిల వెనుక జలాల బారిన పడిన తమ గ్రామాలకు పరిహారం చెల్లించాలని, ఇంకొందరు హౌసింగ్ మంజూరులో ఏళ్ల తరబడి కొనసాగుతున్న అలసత్వాన్ని నివారించాలని కోరుతూ వినతులు సమర్పించారు.



బాధితులు ఆదినారాయణరెడ్డి, గఫార్, నారాయణరెడ్డి, వాలంటీరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతిని అపరిష్కృత సమస్యలు కుంగదీస్తున్నాయి. రెవెన్యూ సంబంధిత సమస్యలే అత్యధికంగా ఉన్నాయి. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లి పంచాయతీ గ్రామస్తుల బృందం ముంపుబారి నుంచి తమను రక్షించాలనే దీనగాధను వినిపించింది. జిల్లా సరిహద్దు ప్రాంతంలోని సోమశిల రిజర్వాయర్ 71.50 టిఎంసిలకు చేరుకుందని, ఫలితంగా తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలను వెనుకజలాలు ముంచెత్తుతున్నాయని, తమను పోలవరం నిర్వాసితుల తరహా పరిహారం చెల్లించి, రక్షించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

ఒంటిమిట్ట రైల్వేకాలనీకి చెందిన ఓ హౌసింగ్ లబ్ధిదారుల బృందం ప్రజాసమస్యల పరిష్కార వేదకను ఆశ్రయించింది. గఫూర్, ముట్లూరు వెంకటయ్య, ముట్లూరు పెద్దసిద్ధయ్య సహా పలువురు లబ్ధిదారులు తమకు రెండేళ్లుగా ఇళ్లు మంజూరు కావడం లేదని వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్, హౌసింగ్ అధికారులను పలుమార్లు సంప్రదించినా, ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదనే పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను రెండవ సారి ఆశ్రయంచామని, ఎప్పటికి పరిష్కారమవుతుందో చూడాల్సి ఉందని వాపోయారు.

పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లికి చెందిన డి.ఆదినారాయణరెడ్డి అనే రైతుకు తిప్పిరెడ్డిపల్లి పొలం పరిధిలోని సర్వే నెంబర్ 851లో 4.68 ఎకరాల్లో 2.5 ఎకరాల భూమిని కబ్జా చేశారని, తమ భూమిని కాపాడి, తమను కబ్జాదారుల నుంచి కాపాడాలని వేడుకున్నారు. తహశీల్దార్‌ను ఆరు దఫాలుగా సంప్రదించినా పలకడం లేదని వాపోయారు.

కలసపాడు, సిద్దవటం మండలాలకు చెందిన జి.ఈశ్వరయ్య, కవిత వాలంటీర్ల బృందం తమకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల మేరకు పారితోషికం ఇవ్వడంతో పాటు, విధుల్లో నియమించాలని కోరుతు వినతిపత్రం అంజేశారు. ఆర్నెళ్లపాటు బకాయి చెల్లించకుండా, తమను గాలిక వదిలేయడం సమంజసం కాదని వాపోయారు. పెద్దముడియం మండలానికి చెందిన అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఇష్టానుసారంగా పోస్టులు భర్తీ చేశారని శ్రీనివాసులు బృందం వాపోయారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చే సుమారు 200 పైగా సమస్యల్లో మచ్చుకు కొన్ని మాత్రమే.

నగరంలో పరిసరాల పరిశీలన

ప్రజాశక్తి -కడప అర్బన్

కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి సోమవారం నగరంలోని పలు కాలనీలు, వీధుల్లో సందర్శించి పరిసరాలను పరిశీలించారు. గంజిగుంట కాలనీలో ఉన్న కెసి కెనాల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, అప్సర సర్కిల్ నుంచి చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ వరకు, చిలకల బావి నుంచి పాలంపల్లి నేషనల్ హైవే రోడ్డు వరకు వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి పలు సమస్యలను సమీక్షించారు. కెసి కెనాల్ సహా అన్ని కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రత్నరాజు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన రిటైర్డ్ జియాలజిస్టు జె.వెంకటరామిరెడ్డి 100 పుస్తకాలను సోమవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ జె.వెంకటరామిరెడ్డి బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో వంశీకి నచ్చిన కథలు, గాలిబ్ గీతాలు, సింహాచల వైభవం, మా పసలపూడి కథలు, భట్టిప్రోలు కథలు, తెలుగు కథాపారిజాతాలు, గ్రంథాలున్నాయన్నారు. పుస్తకాలను బహూకరించిన జె.వెంకటరామిరెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రైతు సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గోపవరం : బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేల్ మండలం తిరువెంగళాపురం రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కె.చంద్ర మోహన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. రబీలో ఇ-పంట నమోదుపై ఆరా తీశారు. పంటల్లో సస్యరక్షణ గురించి వివరించారు. వారి వెంట మండల రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ఎ. సాయి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప : అండర్- 23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రశాంత్ 64, మహేంద్ర రెడ్డి 42 పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి జట్టులోని శివ సూర్యా 2, శివ 2, వంశీ నారాయణ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 269 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.3 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని సాయి శ్రావణ్ 93, విజయ్ 53 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, ప్రదీప్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 79 పరుగుల తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 50.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ 119 పరుగులు (సెంచరీ) చేశాడు. అభినవ్ 75 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్‌నార్త్ జోన్ జట్టులోని హేమంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 346 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి 79 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆ జట్టు లోని హిమకర్ 64, రవి కిరణ్ 65 పరుగులు చేశారు. ప్రకాశం జట్టులోని సుమిత్ నాలుగు, పార్ధసారథి రెండు, పవన్ కుమార్ రెండు వికెట్లు తీసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సోమవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో అందుబాటు లేని కారణంగా కలవలేకపోయామని తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

భారత రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ప్రభుత్వానికి పవిత్ర గ్రంథమని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనిచేయడానికి బలమైన పునాది వేసిందని డిఇఒ యు. మీనాక్షి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం డిసిఇబి హాల్‌లో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన వక్తృత్వ, క్విజ్, డిబేట్, దేశభక్తి గీతాలాపన పోటీలు పాఠశాల, మండల స్థాయిల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు ఈనెల 26న కడపలో నిర్వహించే రాయలసీమ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కడప డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి జి.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవించడమే కాక రాజ్యాంగ విధులను పరిరక్షించి భారత దేశ సౌభాతృత్వానికి కాపాడుతూ ప్రపంచంలో మేటి దేశంగా తీర్చిదిద్దుటకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, మాజీ జిల్లా సైన్స్ ఆఫీసర్లు రెహమాన్, నిత్యానంద రెడ్డి, జిల్లా సైన్సు సమన్వయకర్త డి.వి. సుబ్బానాయుడు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయం కుంటను కాపాడాలి

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని శివాలయం కుంటను భూకబ్జాదాల నుంచి కాపాడి ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని, కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఎం బద్వేల్ పట్టణ నాయకుడు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ శివాలయం కుంటను కొందరు భూకబ్జాదారులు ఆక్రమించి బేస్ మట్టాలు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మరికొందరు శివాలయం కుంటను పూడ్చుకుంటూ పైరు పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారి పైన ఎందుకు రెవెన్యూ, మున్సిపాలిటీ, దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు తెలియజేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఆదిల్, షేక్ ఖలీల్ బాషా పాల్గొన్నారు.

వైసిపి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : వైసిపికి చెందిన భూ బకాసురులపై అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. పెన్నపేరూరు అసైన్మెంట్ కమిటీలో పేదలకు భూములు కేటాయించిన ఇంతరవకు హద్దులు చూపకపోవడంతో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెన్నపేరూరు గ్రామ పొలంలో 2013 సంవత్సరంలో దాదాపు 150 మందికి పైగా అసైన్‌మెంట్ కమిటీలో నిరుపేదలకు భూ కేటాయించారని, ఇంత వరకు హద్దులు చూపకపోవడంతో వైసిపికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మండలంలో వైసిపి ఆగడాలు ఇంకా కొనసాగుతూనే ఉంద న్నారు. వారి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే తహశీల్దార్ స్పందించి హద్దులు చూపించి, కబ్జాకు గురైనా స్థలాలను గుర్తించి వారి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్పేర్‌పార్ట్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని అల్మాస్ పేట సమీపంలో హుండాయ్ ఆర్‌కె స్పేర్స్ జెన్యూన్ పార్ట్స్ షోరూమ్‌ను మత గురువు మౌలానా ముఫ్తి సయ్యద్ మగ్దూం మోహిద్దీన్ హాసని ఖాద్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు స్పేర్ పార్ట్స్ ఎంతో కీలకమని చెప్పారు. ఆర్‌కె ఆటోమొబైల్స్ ఎమ్‌డి షతాజ్ ఖాన్‌కు డీలర్ షిప్ రావడం హర్షణీయమన్నారు. షాతాజ్ ఖాన్ మాట్లాడుతూ తన ప్రతి వ్యాపారాన్ని గురువు ప్రారంభించడం సంతోషకరమన్నారు. షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇంతియాజ్ ఖాన్, ఏజస్ ఖాన్, సమీర్ ఖాన్, షేక్. మొహమ్మద్ ఆజం,బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.



హుండాయ్ ఆర్‌కె స్పేర్స్ జెన్యూన్ పార్ట్స్ షోరూమ్

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని

కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున కడపలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయన్ని కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ, అధికార సంఘాల ప్రతినిధులు కోరారు. సోమవారం కమలాపురం ఎమ్మెల్యే పి.కృష్ణ చైతన్య రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎపిజిబి మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దది కావడం, గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం కలిగి ఉండడం, దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేనటువంటి కరెన్సీ సౌకర్యం కలిగి ఉండడంతో పాటు అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండడం వల్ల ప్రతిపాదిత గ్రామీణ బ్యాంకు కడప లోనే కొనసాగించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలు అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో, నూతనంగా ఏర్పడబోతున్న ఈ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కూడా కడప నుంచి అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన సిబ్బందితో పాటు, ఈ ప్రాంత ప్రజల్లో కూడా ఉందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మళ్ళీ ఒకసారి సిఎంతో మాట్లాడి ఎపిజిబి హెడ్ క్వార్టర్స్ విషయంలో స్పష్టమైన హామీ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.హరిప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్, కోశాధికారి పి.వి.రాహుల్ తేజ్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. సురేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎపిజిబి ప్రతినిధులు

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి : వ్య.కా.స

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న అన్వేష్

ఎర్రగుంట్ల మండల పరిధిలోని వై.కోడూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 756-2 788 792 తదితర సర్వే నంబర్లు 495 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ శ్రీధర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను స్థానిక పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం మేరకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేస్తుందన్నారు. 12 సంవత్సరాల నుంచి భూ పంపిణీ అమలు చేయలేదని, అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి అన్నురులు ఒక్కొక్కరు 30,50 ఎకరాలు చొప్పున కంచెలు వేసుకుని ఎస్టేట్‌గా మలుచుకుని అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు పద్ధతిలో విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పొందారని, వందల ఎకరాలు దౌర్జన్యంగా, అక్రమంగా సాగు చేస్తుంటే గత విఆర్ఒ, తహశీల్దార్లు పెద్ద మొత్తంలో భూ కబ్జాదారులతో చేతుల కలిపి డబ్బులు అర్జించారని తెలి పారు. ప్రభుత్వం సమగ్రంగా విచారించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో పేదలను కలుపుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూ పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గండికోటలో అక్రమ టోల్‌గేట్ వసూలు రద్దు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రపంచ పర్యాటక కేంద్రం గండికోటలో కొద్ది నెలలుగా అక్రమ టోల్ గేట్ వస్లూ చేస్తున్నారని, వెంటనే రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో డిఆర్ఒ విశ్వేశ్వర్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక కేంద్రమై గండికోట ం చూడటానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తున్నారన్నారు. పర్యాటకులకు టోల్ గేట్ ద్వారా గండికోట ఎంట్రీలో టోల్ గేట్ పెట్టి వ్యక్తికి ఒక రేటు, వాహనాలకు ఒక రేటు, సెలవు దినాలలో మరో రేటు పద్ధతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. దీని ద్వారా సుదూర ప్రాంతాలకు వచ్చి వారికి ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కోటలో టాయిలెట్లు, మంచి నీటి సౌకర్యం పర్యాటకులు కూర్చోవడానికి సాండ్‌లు లేవన్నారు. ప్రజల వద్ద నుంచి టోల్ గేటు ద్వారా చేసే వసూలును రద్దు చేయాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పర్యాటకులతో కలిసి ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నిర్మల్ పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

ప్రజాశక్తి - కడప : సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలని నాగపూర్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ సంజయ్ జ్ దోబ్లే, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ విఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ యు. రాంబాబు ప్రిన్సిపల్ సైంటిస్ట్ సి- మెట్ హైదరాబాద్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. హేమలత రుద్రమదేవి అన్నారు. సోమవారం సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సైన్తేసిస్ అఫ్ అడ్వాన్స్ మెటీరియల్స్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సదస్సు ఏర్పాటుచేశారు. సదస్సును యోగి వేమన విశ్వ విద్యాలయం గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్. డి. గిరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లా డుతూ చదువుకునే రోజుల్లో పరిశోధనలు తక్కువగా జరిగేవని, ఆర్థిక ఇబ్బం దులు కూడా ఉండేవని, ప్రస్తుతం సైన్స్, ఇంజినీరింగులలో పరిశోధనలు ప్రోత్స హిచేందుకు సంస్థలున్నాయన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు.

గంగాధర్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : గంగాధర్ సేవలు ప్రశంసనీయమని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం భాస్కర్ పేర్కొన్నారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘ జిల్లా శాఖ అధ్యక్షునిగా ఎన్నికైనటువంటి గంగాధర్‌కు సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ నాయకునిగానే కాకుండా గిరిజన సంఘ నాయకునిగా వారి సేవలు భవిష్యత్తులో అందరికీ అందాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కె. సురేష్ బాబు, పి. చంద్రశేఖర్, జి. రామచంద్రారెడ్డి, ఎస్. అజీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - బద్వేలు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాచపూడి నాగభూషణం విద్యా సంస్థల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులు రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణం నుంచి శివాలయ ప్రాంగణం వరకు రహదారి ఇరువైపులా మొక్కలు నాటారు. నాటారు. ఈ సందర్భంగా నాగభూషణం విద్యాసంస్థల కరస్పాండెంట్ , పరిపాలన అధికారి వెంకట సాయి కృష్ణ, సబ్ రూపిందర్ జిట్ సింగ్ మాట్లాడుతూ చక్కటి వాతావరణం, ఆరోగ్యకరమైన గాలి, వంటివి భవిష్యత్తు తరాలకు ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటి చెట్లగా మారేంతవరకు పర్యవేక్షించాలన్నారు. అదే భవిష్యత్తు తరాలకు మనమిచ్చే పెద్ద ఆస్తిని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె. ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలోఆయన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప

అధికారులు అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడుతో పాటు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని వారి సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించాలని పేర్కొన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత విద్వేష పాలకులు మోడీ, యోగి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న అలీఖాన్

దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మత విద్వేషంతో పరిపాలన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సంభాల్ జిల్లాలో జుమా మసీదు లో న్యాయపరమైన సర్వే అమలులో భాగంగా ఉత్తర ప్రదేశ్ పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ముగ్గురు ముస్లిములను కాల్చి చంపారని ఆరోపించారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు యంత్రాంగం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీకి చెందిన అల్లరి మూకలను అక్కడికి అనుమతించడం ఏమిటని ప్రశ్నించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఆర్ఎస్ఎస్ మూకలు చేసిన విధ్వంసాన్ని అమాయకులైన ముస్లిములపై చూపించి ముగ్గురు యువకులను హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం, చట్టాలను అటకెక్కించి , కేవలం మత విద్వేష పాలన చేస్తూ అమాయక ప్రజలను బలి గొంటున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ దాని వికృత మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ముస్లిములను హతమార్చడాన్ని ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం రహమతుల్లా ఖాన్, చిన్న కులయప్ప, సంజయ్ కాంత, హమీద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

సమగ్ర కులగణన చేయాలని నిరసన

ప్రజాశక్తి-కడప సిటీ

జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, బిసి సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011లో ప్రతిపక్షంలో ఉన్న బిజెపి అగ్ర నాయకులు, 2021లో జనగణనతో పాటే, దేశంలోని అన్ని కులాల జనాభాను లెక్కించి,వారి జీవనస్థితిగతుల్ని సేకరించాలని కోరారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి కుల గణన జరపడం వల్ల జాతీయ సమైక్యత దెబ్బతింటుందంటూ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరో మాటగా మార్చడం తగన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనగణలలో కుల గణన నిర్వహించి, బిసిలకు 34 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో డిఆర్ఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిసి సంఘం అధ్యక్షులు లింగమూర్తి, ఉపాధ్యక్షులు కళ్యాసుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందనాగరాజు, జిల్లా మహిళా అధ్యక్షులు జయశ్రీ, జిల్లా గౌరవాధ్యక్షులు ఖాదర్‌బాషా, రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి, శ్రీనివాసులు, బిసి సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు సిఆర్ఐ సునీల్ జయంత్, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్‌యాదవ్, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు జింకా జయలక్ష్మి, నాయకులు ఉన్నారు.

అర్హులైన వారికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధక శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 1896 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని, జిల్లాకు సంబంధించి 210 పోస్టులకు 137 మెరిట్ లిస్టులో తామే అర్హులమని, న్యాయం చేయాలని బాధితులు దామోదర్, జనార్ధన్, శ్రీనివాసులు, శ్యాం కుమార్, శివరాం కోరారు. సోమవారం ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో ఉన్న ఖాళీలకు ప్రొసీడింగుకు తాము ఐదుగురు అర్హులమని చెప్పారు. మెరిట్ లిస్టులో తమ పేర్లు ఉన్నా పేర్లు లేని అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం అన్యాయమన్నారు. అధికారులు అభ్యర్థులకు నోటిఫికేషన్ విరుద్ధంగా మార్కులు కలిపి నియామక పత్రాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. మొదటి, రెండవ జాబితాలో ఏమీ లేవని తప్పుడు సమాచారం సిఎంఒకు పంపించారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న డిఇఒ మీనాక్షి

'రెయిన్‌బో' విద్యార్థులకు అవార్డులు

ప్రజాశక్తి - ఖాజీపేట

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని సిఎస్ఐ ప్రాంగణంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో ఖాజీపేట రెయిన్ బో స్కూల్ విద్యార్థులు మూడు అవార్డులను సొంతం చేసుకున్నట్లు ఆ పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిషన్ కాంపిటీషన్, వ్యాసరచన, డిబేట్ పోటీ పరీక్షల్లో తేజవర్ధన్ రెడ్డి, లక్ష్మీప్రణతి, రూపా అవార్డులు సాధించారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఘనంగా సన్మానించి, అభినందించింది.



డిఇఒతో సాయితేజ పాఠశాల విద్యార్థులు

సాయితేజ విద్యార్థుల ప్రతిభ..

స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న సాయితేజ పాఠశాల విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నతస్థానంలో నిలిచారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కాంపిటీషన్ స్పీచ్ పోటీలో సునంద్ మొదటి స్థానం, డిబేట్‌లో కెఎస్ ముజ్‌ఫర్ రెండో స్థానంలో నిలిచారు. కడపలో జరగబోయే జోనల్స్‌లో మంచి విజయాన్ని సాధించాలని పాఠశాల కరస్పాండెంట్ సాలిగారి రాజేశ్వరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి అభినందించారు.




ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

'శ్రీచైతన్య' విద్యార్థులు...

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులలో నిర్వహించిన పెయిటింగ్, చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ సాధించినట్లు శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. కడప బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 23 పాఠశాలల నుండి 952 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పి.మిధునశ్రీ సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో రాణించినట్లు చెప్పారు. జూనియర్ విభాగంలో జస్వంత్ ద్వితీయ స్థానం సాధించి తమ ప్రతిభను చూపారని పేర్కొన్నారు. ప్రిన్సి, జస్మితా కన్సోలేషన్ బహుమతులు సాధించారని ఆయన తెలిపారు. షణ్ముగప్రియ, లస్యశ్రీ, పూర్ణిమ, బ్రహ్మణి, షైని, సాహిత్య అనే విద్యార్థులు కూడా తమ ప్రతిభను చాటినట్లు చెప్పారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యపై ప్రత్యేకదృష్టి పెట్టాలని పులివెందుల ఎఎస్‌డబ్ల్యుఒ రామాంజనేయులు విద్యార్థులకు సూచించారు. స్థానిక కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వద్ద ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో చదివే విద్యార్థులకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన బెడ్‌షీట్లు ఎఎస్‌డబ్ల్యుఒ రామాంజనేయులు, విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా సభ్యుడు వి.నాగన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. అందుకు తగ్గట్లు విద్యార్థులు చదువుకోవాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. నోట్ పుస్తకాలు కూడా అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మాణిక్యరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వెలుగు సమావేశ హాలులో శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెలుగు సమావేశం హాలులో మంగళవారం కిషోరీ బాలికా వికాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. మిషన్ శక్తి పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. మహిళా పోలీసులు, వెల్ఫేర్, విద్య అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు హాజరవుతారని తెలిపారు. కౌమార దశలో ఉన్న బాలికల గురించి, ఆత్మరక్షణ, యోగ, ఫోక్సో చట్టం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



రోడ్డుపై పడి ఉన్న కోడిగుడ్లు

స్థానిక కడప రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో కోడిగుడ్ల బొలేరో వాహనాన్ని రేషన్ బియ్యం లారీ ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమా దంలో బొలేరో డ్రైవర్ ప్రసాద్ తలకు గాయా లయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివ రాలు.. వేముల వైపు నుంచి పులివెందులకు వస్తున్న కోడిగుడ్ల బోలేరో వాహ నం, కడప నుంచి పులివెందులకు వస్తున్న రేషన్ బియ్యం లారీ ఢీకొన్నాయి. బోలేరో వాహనం, లారీ ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గాయపడిన ప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికిగల కారణాలను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు.

కాలువ ఆధునికీకరణ జరిగేనా..!

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు ఆనుకుంటలో కేసీ కెనాల్ చెరువు అలుగు నీరు ప్రవహించే కాలువ సిమెంట్ లైనింగ్ ఏర్పాటుకు కొన్నేళ్లుగా నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ కాలువలో మురుగు నీరు పారుతోంది. వర్షాకాలంలో నీరు అధికంగా వస్తే.. ఆనకుంట కాలువ గుండా ప్రవహించాలి. పట్టణంలోని బద్వేల్ రోడ్డు నుంచి సాయి బాబా క్లాత్ మార్కెట్, కడప రోడ్డులోకి ఈ నీరు ప్రవహిస్తూ ఉంటోంది. లైనింగ్ లేకపోవడంతో కాలువ పూర్తిగా పూడికతో నిండింది. గత ప్రభుత్వ హయాంలో ఈ కాలువను అప్పటి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రజల అభ్యర్థన మేరకు పరిశీలించి వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కానీ అది ఆచరణకు నోచుకోలేదు. కాలువ ఆధునీకరణ అందని ద్రాక్షగా మిగిలిపోయింది. సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేస్తే వర్షపు నీరు సులభంగా ప్రవహించే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరణ సాధ్యపడుతుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వమైనా కాలువల ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.



పూడికతో నిండిపోయిన అనుకుంట కాలువ

తల్లిదండ్రులకూ బాధ్యత ఉంది : ఆర్‌జెడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి రవి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థుల పట్ల అధ్యాపకులకు ఎంత బాధ్యత ఉందో.. అంతకేంటే ఎక్కువ తల్లిదండ్రులకు కూడా ఉందని ఆర్‌జెడి, ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్ రవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రతి రోజూ కళాశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కళాశాలలో చెప్పిన పాఠాలపై కూడా అప్పుడప్పుడు విద్యార్థులను అడగడంతోపాటు నోటు పుస్తకాలను తల్లిదండ్రులు తనిఖీ చేయాలని కోరారు. అలవాట్లుపై తల్లిదండ్రులు ప్రత్యేకదృష్టి పెట్టి మంచి మార్గంలో నడిచేలా చూడాలని రవి సూచించారు. వీలున్నప్పుడు కళాశాలకు వచ్చి విద్యార్థుల నడవడికపై అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి నివేదికలను చదివి తల్లిదండ్రులకు తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు భాస్కర్ నాయక్, ఫైరోజ్, షఫీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో అర్హులైన చేనేత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. ఆ మేరకు సోమవారం ఆర్‌డిఒ ఆర్డిఓ సాయిశ్రీకి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన భాగం చేనేతలు ఎక్కువ మంది మగ్గంపై జీవిస్తున్న నియోజకవర్గం జమ్మలమడుగు అన్నారు. నేతన్నలకు అర్హులైన వారికి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు దూరం అవుతున్నారని తెలిపారు. రాయితీ రుణాలు, ఇంటి స్థలాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు అనర్హులుగా ఉంటున్నారని వివరించారు. గతంలో కనీసం మాన్యువల్ గా అయిన కార్డులు ఇచ్చేవారని తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, దాసు, పల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

దత్తత పొందడం వరం లాంటిది

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

దత్తత పొందడం వరం వంటిదని స్త్రీ శిశు సంక్షేమ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత తెలిపారు. సోమవారం మైదుకూరు స్త్రీ శక్తి భవన్‌లో అంత ర్జాతీయ దత్తత మాసోత్సవాలు, కిషోర్ వికాసం, 100 రోజుల ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహి స్తున్నారన్నారు. దత్తత కార్యక్రమం ద్వారా బిడ్డలను పొందే వరాన్ని ప్రభుత్వం అందించడం చాలా సంతోషమన్నారు. సిఎఆర్ఎ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ క్రేజీ ప్రశాంతి మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవలు, బాల్యవివాహాల వలన కలుగు పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ విజయకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కేజియా, డ్వాక్రా సంఘాల ప్రతినిధి, డ్వాక్రా సంఘాల ఆర్పీలు, డిసిపియు సిబ్బంది పాల్గొన్నారు.



వీరభద్రస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు

వీరభద్రుడికి పల్లకీసేవ, ఊరేగింపు

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో నాలుగవ కార్తీక సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు పల్లకి సేవ, ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రం, ఆర్యవైశ్య, సర్వజన అన్నదాన సత్రాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వజన అన్నదాన సత్రంలో ఖాజీపేట మండలానికి చెందిన జంగిటి వెంకట సుబ్బయ్య అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. మహిళల కోలాటం ఆకర్షించింది. కార్యక్రమంలో ఇఒ మారుతీప్రసాద్, టిడిపి నాయకులు పెరుగు నారా యణ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, వీరారెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూజలు, అన్నదానాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కార్తీకమాసం చివరి సోమవారం పుర స్కరించుకుని వేంపల్లెలోని శైవ క్షేత్రాల్లో భక్తులు పోటెత్తారు. జనమే జయుడు కాలంలో ఉన్న పాపాగ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ దుర్గా గవి మల్లేశ్వరస్వామి దేవస్థానం, పాతపేటలోని భవాని నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం ఆవరణలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం బలిజ సంఘం ఆధ్వర్యంలో భక్తులు, దాతల సాయంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవం.. గురుకుంట తిరుణాల

సింహాద్రిపురం : మండలంలోని గురజాల సమీపంలో వెలసిన గురుకుంట క్షేత్రంలో ఆంజనేయస్వామి, శివునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం కార్తీక మాస చివరివారం కావడంతో పూజలు చేపట్టారు. మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు. గురజాల గ్రామంతోపాటు సింహాద్రిపురం, హిమకుంట్ల, వెంకటంపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎస్ఆర్ఐటిలో ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్ టాక్

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో బిటెక్ సివిల్ విద్యార్థులకు ప్రొద్దుటూరు సిండికేట్ ప్లానర్స్ డైరెక్టర్ కె.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్ఎస్, జిఐఎస్-జిపిఎస్ అనే అంశంపై ఎక్స్‌పర్ట్ టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పాత పద్ధతులు, భౌగోళిక సమాచార వ్యవస్థ, ప్రస్తుత సివిల్ ఇంజనీరింగ్ రంగంలో అవలంభిస్తున్న గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ గురించి వివరించారు. సివిల్ హెచ్ఒడి సురేష్ బాబు మాట్లాడుతూ జీపీఎస్‌తో శిక్షణ, ప్రాజెక్టు వర్క్స్ చేయడం, జీపీఎస్ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీం కుమార్‌రెడ్డి, కరస్పాం డెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి, హెచ్ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పులివెందుల రూరల్ : రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంవిఐ వెంకటప్రసాద్ సూచించారు. పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుతూ రహదారి నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరూ ఈ నియమాలు పాటించాలని కోరారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. లైసెన్స్ ఉంటేనే వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవిఐ వెంకటప్రసాద్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచిం చారు. ఆరవేటిపల్లెలో ఎన్‌డిఎస్‌హెచ్ 1012 రకం విత్తనాలతో సాగు చేసిన పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, పెసర వంటి ప్రకృతి వ్యవసాయ పంటలను సోమవారం ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర పంటలో పల్లాకు తెగులు ఆశించిన మొక్కలను ఏరివేసి కాల్చి వేయాలన్నారు. మొక్కజొన్న పంటలో మొవ్వ పురుగు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రైతులు అవసరం మేరకే పురుగు మందులు వాడుకోవాలని సూచించారు. ద్రవ జీవామృతం ప్రయోగాత్మకంగా తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. తయారీ విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహత్, రామసుధ, పుష్ప పాల్గొన్నారు.



ద్రవ జీవామృతం తయారీని పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి



శ్రీరాములును పరామర్శిస్తున్న ఎంపీ

కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - వేముల

మండలంలోని అమ్మయ్యగారిపల్లి గ్రామపంచాయతీలోని వైసిపి సీనియర్ నాయకుడు చిట్టిబోయిన శ్రీరాములును కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. శ్రీరాములు కొద్ది రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎంపీ ఆయనను పరామ ర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ కోసం కష్టపడేవారికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడుతానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులతో కొద్దిసేపు సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పూసల కొట్టాలు సమీపంలోని కడప-కర్నూలు జాతీయ రహదారి సమీపాన ఉన్న హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హోమాలు, అభిషేకాలు తదితర ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభ వంగా జరిగింది. కోలాటం, దీపోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున సాగింది. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీమంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి, వైసిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు రాజకీయ ప్రము ఖులను ఘనంగా సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అయ్యప్ప మాలధారులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. మండలంలోని నాగనాథేశ్వరకోనకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పలు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేశారు.



అర్చకులు నిర్వహిస్తున్న హోమం, గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి

ప్రత్యేక హోదా మాటేమిటి..!

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విశాఖ రైల్వేజోన్ సరే.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా విశాఖ కేంద్రంగా నూతన దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధి కారంలోకి వచ్చి ఉంటే విశాఖ రైల్వేజోన్ ఎప్పుడో వచ్చేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోస గారితనం, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల చేత గానితనంతో ఇప్పటివరకు రాలేదని తెలిపారు. విభజన చట్టంలో 14వ షెడ్యూలు ప్రకారం విభజన జరి గిన 6 నెలల లోపు కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కావాలని చెప్పారు. 10 ఏళ్లు అయినా అతీగతీ లేదన్నారు. ఈ పార్ల మెంటు సమావేశాలల నైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియా, సైబర్ నేరాలపై జాగ్రత్త

వేంపల్లె : సోషల్ మీడియా, సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తలు వహిం చాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు సూచించారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ వారం సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో చాలా నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కంప్యూటర్ అధ్యాపకుడు షఫీయుద్దీన్ మాట్లాడుతూ సమాజంలో రకరకాలుగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలి పారు. సోషల్ మీడియాలో వస్తున్న వాటిని ఎక్కువగా నమ్మరాదన్నారు. సైబర్ ద్వారా నష్ట పోయామని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నాగలక్ష్మిదేవి, అరవింద్, మాధవరావు, కేశమ్మ, శ్రావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.